క్లుప్తంగా

బీమా కార్డు దారులకు ఆరోగ్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సీఎస్‌సీ బృందం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ఆదివారం సీఎస్‌సీ(సెంట్రల్ సర్వీస్ సొసైటి) ఆధ్వర్యంలో జీవిత బీమా కార్మిక కార్డు ఉన్న వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 15 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎస్‌సీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో సుమారు 700మందికి గాను 350మందికి వైద్య పరీక్షలు చేశామని, మిగతా వారు కూడా చేయించుకోవాలని సూచించారు.

కేసులు ఎత్తివేయడం హర్షణీయం

దౌల్తాబాద్: తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయడం హర్షణీయమని ఓయూ జేఏసీ నాయకుడు రెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. ఉద్యమకారులపై వలస వాదులు అక్రమ కేసులు పెట్టి, జైల్లో పెట్టారని, కోర్టుల చుట్టూ తిప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే.. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్.. మాట మరచి, ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపడమే కాకుండా.. కేసులు పెట్టారని ఆరోపించారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


సీఐని సన్మానిస్తున్న స్వాములు

కొత్తూరు: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ ఆలయంలో అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఆధ్యాత్మికత అలవర్చుకుంటే ఒత్తిడిని జయించ వచ్చునని చెప్పారు. ఇందులో స్వాములు దాసరి నర్సింహ్మ, శ్రీను, యాదయ్య, దేవేందర్, నాగరాజు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మూడు రోజులుగా స్వామివారి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆదివారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, నాభిశిల ప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నదానం వితరణ చేశారు.

భగవద్గీత ప్రచారం


ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

కొందుర్గు: హిందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్‌లో భగవద్గీత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోనంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు నాగ్యానాయక్ మాట్లాడారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాలను తెలుసుకొనుట వలన మద్మాత్మ ఆరాధనలతో ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. భగవద్గీతతో జ్ఞానం ద్వారా కులమతాలను రూపుమాపడానికి దోహదం చేస్తుందన్నారు. సర్వ మతాలకు దేవుడొక్కడేనని, దైవ భక్తిని పెంపొందించాలని సూచించారు.

రోడ్డుపై వాగ్వాదం

తుర్కయంజాల్: సాగర్ రహదారి తుర్కయంజాల్‌లో రెండు కార్ల యజమానుల నిర్లక్ష్యం కారణంగా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. చౌరస్తాలోని ఓ వస్త్ర దుకాణం ఎదుట ఆదివారం మధ్యాహ్నం నిలిపి ఉన్న ఇన్నోవా కారు, డిజైర్ కార్లు ఒకదానికి ఒకటి ఢీకొని స్వలంగా దెబ్బతిన్నాయి. దీంతో కార్లకు చెందిన వ్యక్తులు రోడ్డుపైనే వాగ్వాదానికి పాల్పడడంతో అరగంట పాటు ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీస్ పర్యవేక్షణ కొరవడిందని, వారు ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని స్థానికులు చెప్పారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం


శ్రీ ఆకారంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ధారూరు: కార్తీక మాసం ముగింపు సందర్భంగా మండల పరిధి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మహిళలు ఘనంగా లక్ష దీపోత్సవం చేశారు. ఆలయ ఆవరణలో పూలతో ఓం, త్రిశూలం, శివలింగం, స్వస్తిక్ వేశారు. ప్రథమ పూజ్యుడు, గణపతి, కపిలేశ్వరస్వామి, పార్వతీమాత, వీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వర స్వామి, నవ గ్రహాల వద్ద ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రమిదల్లో ఒత్తులు వేసి దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులు పసుపు, కుంకుమలు ఇచ్చిపుచ్చుకొన్నారు. పూజారి చెన్నబసవయ్యస్వామి శంఖం ఊది, హారతి ఇచ్చి వేడుకను ముగించారు.


శివలింగం ఆకారంలో..


స్వస్తిక్ రూపంలో

‘వసతి’పై నిర్లక్ష్యపు నీడ

- 2012లో నిర్మాణ పనులకు శంకుస్థాపన
- పుష్కరకాలమైనా పిల్లర్లకే పరిమితం
- సౌకర్యాల లేమితో చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రభుత్వాలు మారుతున్నా పెద్దేముల్ ప్రభుత్వ వసతి గృహానికి మోక్షం కలగడం లేదు. పుష్కర కాలం క్రితం మొదలైన హాస్టల్ భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. అధికారుల నిర్లక్ష్యం వలన అది పిల్లర్లకే పరిమితం అయింది. దీనితో ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వసతుల లేమితో చదువుకు దూరం అవుతున్నారు!.


నిలిచిపోయిన వసతి గృహ నిర్మాణ పనులు (ఇన్‌సెట్లో) శంకుస్థాపనకే పరిమితమైన శిలాఫలకం (ఫైల్)



పెద్దేముల్: పేరుకే ఆదర్శ పాఠశాల. వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కేజీ నుంచి పీజీ వరకు చదివించి, వారి భవిష్యత్తు నిర్మాణ బాధ్యత మొత్తం ప్రభుత్వానిదే అని చెప్పుకునే పాలకులు.. వారి విన్నపాలు ఆలకించడం లేదు. కష్టాలను చూడటం లేదు. దీంతో దూరప్రాంత విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విధిలేక కొందరు విద్యకు దూరం అవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామ శివారులో (మోడల్ స్కూల్) ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు కొనసాగుతోంది. ఈ బడిలో పెద్దేముల్, బంట్వారం మండలాల పరిధి గ్రామాలు తట్టెపల్లి, ఇందూరు, ఆత్కూర్, గిర్మాపూర్, అడ్కిచెర్ల, బస్వాపూర్, తౌర్మామిడి బండమిదిపల్లి, పాషాపూర్ నుంచి సుమారు 600 మంది విద్యార్థులు చదువుకుంటారు. కానీ వీరికి స్థానికంగా వసతి గృహం లేదు. వారి సౌకర్యార్థం 2012 ఆగస్టులో నాటి ప్రభుత్వం హాస్టల్ భవన నిర్మాణానికి (సీఎస్ఎస్) గ్రాంట్ కింద రూ.ఒక కోటి 28 లక్షల 82 వేలను మంజూరు చేసింది. అప్పటి హోం మంత్రి సబితారెడ్డి గొట్లపల్లి గ్రామ శివారులో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా, అసంపూర్తిగా నిలిచిపోయాయి. పుష్కర కాలం కావచ్చినా.. ఎక్కడి గొంగళి అక్కడేనన్న చందంగా ఆ వసతిగృహం గురించి పట్టించుకునే వారు లేరు. దీంతో పిల్లర్ల దశలో దిష్టి బొమ్మలా ఆ నిర్మాణం దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులకు విషయం తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

రూ. కోటికి పైగా నిధులు కేటాయించి చేపట్టిన వసతి గృహ నిర్మాణ పనులు ఇలా మధ్యలో నిలిచి పోవడాన్ని మండల పరిధి సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని తెలుస్తోంది. గత ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నామని ఆర్భాటం చేసిందని, కానీ విద్యార్థుల వసతి మరిచిందని పలువురు విమర్శిస్తున్నారు. సౌకర్యాల లేమితో నానాటికీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తిచేసి, విద్యార్థులకు వసతి కల్పించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, ఈసీఈలకు విద్యార్థులు లేక బైపీసీ, సీఈసీలు మాత్రమే కొనసాగుతోందని కళాశాల సిబ్బంది పేర్కొన్నారు.

ఉన్నత విద్యకు దూరం

- ఆర్థిక ఇబ్బందులతో పొలం పనుల్లో చదువుల తల్లి
- సాయం అందించే చేతుల కోసం ఎదురుచూపులు


కళాశాల టాపర్‌గా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని సూర్య (ఫైల్)

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షే అయింది. పై చదువులు, వృత్తి విద్యా కోర్సులు చదివేందుకు ఆర్థిక స్థోమత లేక విద్యకు దూరం అవుతున్నారు. సరస్వతి కటాక్షం లభించినా.. కనక మహాలక్ష్మి కటాక్షం లేకపోవడంతో మధ్యలోనే పులిస్టాప్ పెడుతున్నారు. కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని సూర్య హార్టికల్చర్ డిప్లొమాలో ప్రతిభ కనబర్చి కళాశాల టాపర్‌గా నిలిచింది. అనంతరం హార్టికల్చర్ బీఎస్సీ చదివేందుకు జరిగిన ప్రవేశ పోటీపరీక్షలో తెలంగాణలో రెండో స్థానం సంపాదించింది. కానీ నాలుగేళ్ల కోర్సులో చేరేందుకు సుమారు రూ.3లక్షలతో పాటు మెస్ చార్జి, సెమిస్టర్ ఫీజులు కట్టేందుకు ఆర్థిక పరిస్థితులు అడ్డుగా మారాయి.

సాయం కోసం..

విద్యార్థిని సూర్యకు ఒక సోదరుడు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. వారి తల్లిదండ్రులు లక్ష్మి, ఓగలయ్య దంపతులు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ నలుగురు పిల్లలను చదివిస్తున్నారు. అయినప్పటికీ.. ఉన్నత చదువులకు పెద్దమొత్తంలో డబ్బులు అవసరం కావడంతో సాయం చేసే చేతుల కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ఎవరైనా ఆదుకుంటే ఉన్నత చదువులు చదివి, తగిన ఉద్యోగం చేసి కుటుంబానికి, సమాజానికి అండగా నిలుస్తానని విద్యార్థిని సూర్య చెప్పారు.

ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరం

చేవెళ్ల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని సత్యసాయి సేవా సమితి సభ్యుడు గోపాల కృష్ణచారి, రామగౌడ్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీభగవాన్ సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్‌కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ శిబిరంలో 100 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. వీరిలో కంటి ఆపరేషన్‌లు అవసరం ఉన్న వారిని గుర్తించి, వారిని నానక్‌రామ్‌గూడలోని ఆసుపత్రిలో ఉచిత ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ప్రతి నెల రెండో శనివారం ఈ వైద్య శిబిరం నిర్వహిస్తామని శంకర కంటి ఆసుపత్రి ఇన్‌చార్జి విశ్వం తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పెంటారెడ్డి, మాధవ్‌రెడ్డి, బుచ్చిరాములు, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, విజయ్ కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ అపారం.. ప్రోత్సాహం శూన్యం

- జీవనోపాధి కల్పించాలని కోరుతున్న స్నేక్ క్యాచర్

కుల్కచర్ల: విష సర్పం కనపడగానే సాధారణ పౌరులు ఎవరైనా భయంతో ఆమడ దూరం పరిగెత్తడం సహజమే. కానీ పాములు పట్టడంలో నేర్పరి అయిన ఓ యువకుడు తన ప్రతిభతో వెలిగిపోతున్నా.. ప్రోత్సాహం కరవై కరవు కాటకాలతో అలమటిస్తున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కుల్కచర్ల గ్రామానికి చెందిన మొల్ల ఆజాం పాములు పట్టడంలో దిట్ట. బెల్గాం చిట్టి ఏ రినౌన్ స్నేక్ క్యాచర్' నుంచి 4 నెలల పాటు శిక్షణ పొంది సర్టిఫికెట్ పొందాడు. అందులో భాగంగానే జనారణ్యంలోకి సర్పం వచ్చిందని తెలిస్తే.. వెంటనే దానిని ఒడిసి పట్టి అటవీ ప్రాంతంలో వదిలేస్తుంటాడు. వాటిని చంపవద్దని, జంతు సంపదతను కాపాడుకోవాలని సూచిస్తుంటాడు. పాములు పట్టడంలో హస్తవాసే అయినా.. అతనికి సరైన జీవనోపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ప్రోత్సాహకం కరవై.. పాఠశాల బస్సు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. తాను నేర్చుకున్న విద్య.. పది మందికి మేలు చేయడంతో పాటు, ఉపాధి పెంపొందించుకోవాలన్న లక్ష్యంతో సర్పాలు పట్టేందుకు అవసరమైన సామగ్రిని తెచ్చుకున్నారు. కానీ ఉపాధి లేక అవస్థలు పడుతున్నాడు.


పట్టుకున్న పామును అటవీ ప్రాంతంలో వదిలి పెడుతున్న స్నేక్ క్యాచర్ (ఫైల్)

ఉపాధి కల్పించాలి

‘తన జీవనోపాధికి ప్రస్తుతం కొంతమేర ఉపశమనం కలిగినా.. చాలీచాలని సంపాదనతో అలమటిస్తున్నాను. ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. పూర్తిస్థాయిలో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాను. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు సరైన పని కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి' అని స్నేక్ క్యాచర్ ఆజాం కోరుతున్నాడు.

ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

శంకర్‌పల్లి/మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ కూడా నిరుద్యోగులను మోసం చేయకుండా, వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో వీఆర్ఓ, వీఆర్ఏలను తొలగించి గ్రామస్థాయిలో ఇబ్బందులు సృష్టించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసి, సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో నారు..

సాగులో కొత్త ఒరవడికి నాంది

- రకరకాల పూతోటలపై రైతుల ఆసక్తి
- సంప్రదాయ విధానాలకు స్వస్తి
- ఆధునిక పద్ధతులకు నాంది
- వ్యవసాయంలో రాణిస్తున్న దంపతులు

షాబాద్: మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు విధానంలో రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. సంప్రదాయ విధానాలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతులను పాటిస్తున్నారు. విత్తు దగ్గరే చిత్తు కాకుండా నర్సరీలో పెంచిన నారును నమ్ముకుంటున్నారు. వ్యవసాయ భూమిలో వివిధ రకాల పంటలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్న ఊరిలోనే సాగుపై మక్కువతో రాణిస్తున్నారు. తమ పొలంలోనే పూల మొక్కల నర్సరీని ఏర్పాటు చేసుకొని పెంచిన వాటిని మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. షాబాద్ మండలం సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన యువ దంపతులు దాదె రాజు, స్వప్న రాణిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరు మరో35 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. నెలకు రూ.2లక్షకు పైగానే ఆదాయం పొందుతున్నారు. స్వయం ఉపాధితో రాణించాలని వ్యవసాయంలో ముందుకు సాగుతున్నారు. ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలోని తమకున్న 2 ఎకరాల్లో రూ.15లక్షలతో పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేసుకున్నారు. అందులో గులాబీ, చామంతి, బంతి నారు పెంచుతున్నారు. మార్కెట్‌లో గులాబీ నారును రూ. 20వరకు విక్రయిస్తుండగా వారు మాత్రం రూ.12 నుంచి 15 వరకు అమ్ముతున్నారు. చామంతి నారు సైతం రూ. 1.50నుంచి రూ.2 వరకు విక్రయిస్తున్నారు.


నర్సరీలో పూల నారును పెంచుతున్న నిర్వాహకులు

నాణ్యమైన నారు సరఫరా..

ఒక రైతుగా తను ఇక్కడే విత్తనాలు పోసి నారు పెంచడంతో రైతులకు అతడిపై నమ్మకం ఏర్పడింది. ఫోన్ ద్వారా నారు బుక్ చేసుకుని తీసుకు వెళ్తుంటారు. దాదాపు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి రైతులు ఇక్కడికి నుంచే నారును తీసుకుపోతున్నారు. విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, కడప ప్రాంతాలకు సైతం ఇక్కడి నుంచే నారు సరఫరా అవుతోంది. ఇతర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టులో వచ్చే నారుకంటే ఈ నారుతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయంలో ఉన్న లాభాలు మరో వ్యాపారంలో రావని చెబుతున్నారు. తమిళనాడు, కృష్ణగిరి నుంచి గులాబీ నారు విత్తనాలు సెంట్‌బుల్లెట్, కస్టార్, ఎల్లో ఆరెంజ్ రకాలు తీసుకువచ్చి ఇక్కడ నర్సరీలో పెంచుతారు.

35 మందికి ఉపాధి..

రాజు, స్వప్న దంపతులు ఉపాధి పొందుతూ.. మరో 35 మందికి పని కల్పిస్తున్నారు. ట్రేలలో ఎరువులు నింపడం, విత్తనాలు వేయడం, నారు మొక్కలు పెట్టడం, రైతులకు నారు తీసి అందించడం వంటి పనులు చేస్తుంటారు. కూలీలకు రోజుకు రూ. 300 వరకు కూలి చెల్లిస్తున్నారు.


నారును పరిశీలిస్తున్న స్వప్న

సాగుపై మక్కువతోనే ఏర్పాటు..



వ్యవసాయంపై మక్కువతోనే నర్సరీ ఏర్పాటు చేసి గులాబీ, చామంతి నారు మొక్కలు పెంచుతున్నాము. బయట మార్కెట్‌లో గులాబీ మొక్కకు రూ. 20కి పైగానే ధర ఉంది. మా దగ్గర రూ.12నుంచి 15 వరకు లభిస్తుంది. వివిధ జిల్లాలకు నారు సరఫరా చేస్తున్నాం.

–రాజు, నర్సరీ నిర్వాహకుడు, సర్దార్‌నగర్

నర్సరీలో పెరుగుదల..



నర్సరీలో నారు పెరుగుదల ఆరోగ్యంగా ఉంటుంది. పంట పొలాల్లో నారు పోస్తే చలికి, వానకు నారు సక్రమంగా మొలకెత్తడం లేదు. విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక ఉష్ణోగ్రత ఉంటే నారు చనిపోతుంది. సాధారణంగా రైతుల పొలాల్లో నారు పెంచే సమయంలో ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీలో అయితే ఎండ పడకుండా షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు. దీంతో నారు ఆరోగ్యంగా పెరుగుతుంది.

–బంట్టు కిష్టయ్య, రైతు, లక్ష్మరావుగూడ, షాబాద్

సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం


నేదునూరులో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

కందుకూరు: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని వైస్ ఎంపీపీ శమంత, కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్ అన్నారు. ఆదివారం మండల పరిధి నేదునూరులో మహిళలు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను కేవలం రెండు రోజుల్లోనే ప్రభుత్వం అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అందరూ పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, బలవంత్‌రెడ్డి, శ్రీశైలం, అమీన్‌బేగ్, సురేష్, సంజీవ, పెంటయ్య, ఎండీ పాష, జగన్, ఎండీ ఖాజా, శ్రీరాములు, జంగయ్య, షోయబ్‌బేగ్, భాస్కర్‌రెడ్డి, రమేష్, మహేందర్, దర్శన్, సుధాకర్, మహేశ్, శ్రీను పాల్గొన్నారు.